సాక్షి
బాపట్ల
గురువారం । 19 । జనవరి । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1216 క్యూసెక్కులు విడుదల చేశారు. కాలువలకు 1046 క్యూసెక్కులు వదులుతున్నారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.8660 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 2000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో

గుంటూరుమెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.



న్యూస్‌రీల్

వారిపై కన్నేసి ఉంచండి

విస్తృతస్థాయి సమావేశంలో ఎస్పీ



బాపట్లటౌన్:పాతనేరస్తులు.. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం జిల్లాలోని ఎస్ఐలు, సీఐలతో వర్చువల్ విధానంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ రౌడీషీట్లు ప్రారంభించడానికి, సత్ప్రవర్తన కలిగి ఉన్నవారిని గుర్తించి వారిపై ఉన్న షీట్లను తొలగించడానికి తీసుకోవల్సిన చర్యల గురించి క్షుణ్ణంగా వివరించారు. రేప్, ఫోక్సో, హత్య కేసులో నిందితులుగా ఉన్న వారిపై నూతనంగా రౌడీషీట్లు ఓపెన్ చేయడానికి పలు సూచనలు చేశారు. రౌడీషీట్లను తొలగించడానికి ప్రపోజల్ పంపిన వ్యక్తుల వివరాలు, వారు గతంలో చేసిన నేరాలు, గత పది సంవత్సరాల నుంచి వారి ప్రవర్తన వంటి విషయాల గురించి క్షుణ్ణంగా తెలుసుకుని వారు మళ్లీ ఏదైనా నేరానికి పాల్పడే అవకాశం ఉంటుందా అనే కోణంలో విచారించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. లోక్ అదాలత్ పై ప్రత్యేక దృష్టి సారించి భార్యాభర్తల వివాదాలు, కుటుంబ తగాదాలు, ఇతర రాజీ చేయదగిన కేసులను గుర్తించి ప్రతి కేసులలోని కక్షిదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారి మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించి రాజీమార్గం చూపించాలన్నారు. లోక్ అదాలత్ ప్రయోజనాలను కక్షిదారులకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ జి.లక్ష్మయ్య, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మార్చి 4, 5న టైప్ రైటింగ్ పరీక్షలు

రేపల్లె: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ విజయవాడ వారిచే నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షలు మార్చి 4, 5 తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఏపీ టైప్‌రైటింగ్ అండ్ షార్ట్‌హ్యాండ్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సి.వి.మోహనరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా టైప్ రైటింగ్ పరీక్షలు ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషలలో లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్, అదనంగా ఇంగ్లిష్ జూనియర్ గ్రేడ్ పరీక్షలను మార్చి 4, 5 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా 38 కేంద్రాల్లో నిర్వహిస్తారన్నారు. షార్ట్ హ్యాండ్ తెలుగు పరీక్షలు ఫిబ్రవరి 25న, షార్ట్ హాండ్ ఇంగ్లీష్ పరీక్షలు ఫిబ్రవరి 26న అన్ని గ్రేడ్‌లలో 6 కేంద్రాలలో జరుగుతాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోపు ఫీజు చెల్లించాలని, పూర్తి వివరములకై స్థానిక ప్రభుత్వ గుర్తింపు కలిగిన టైప్ ఇనిస్టిట్యూట్స్‌లో సంప్రదించాలని చెప్పారు.

ఉపాధ్యాయుల కొరతకు చెక్

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 450 పోస్టులు భర్తీ

గుంటూరుఎడ్యుకేషన్: పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చి, విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యాంశాల బోధన జరిగేందుకు అర్హత కలిగిన ఎస్జీటీలను తాత్కాలిక ప్రాతిపదికన నెలకు రూ.2,500 టీచర్ అలవెన్సుపై నియమించేందుకు ప్రభుత్వం ముందుచూపుతో తీసుకున్న నిర్ణయం ఆచరణలోకి వచ్చింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీష్, గణితం, బయాలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులను బోధించేందుకు ఉపాధ్యాయులు తగినంత మంది లేక విద్యాబోధనకు ఆటంకంగా మారింది. సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు సీనియర్ ఎస్జీటీలను నెలకు రూ.2,500 టీచర్ అలవెన్సుపై తాత్కాలిక ప్రాతిపదికన నియమించేందుకు ఈనెల 13న గుంటూరులోని డీఈవో కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో భాగంగా ఆయా సబ్జెక్టుల వారీగా 226 మంది ఉపాధ్యాయులను నియమించారు. 30 శాతం డీఎస్సీ కోటా కింద బుధవారం మరో 210 మంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ విధంగా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టులను బోధించేందుకు మొత్తం 436 మంది ఉపాధ్యాయులను నియమించనుండగా, వారితోపాటు ఉర్దూ విభాగంలో మరో 14 మంది టీచర్లు నియమితులు కానున్నారు. ఈ విధంగా ఉమ్మడి జిల్లా పరిధిలో 450 పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేశారు.

నేడు పాఠశాలల్లో వేమన జయంతి వేడుకలు నిర్వహించాలి

గుంటూరుఎడ్యుకేషన్: యోగి వేమన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న దృష్ట్యా జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించాలని డీఈఓ పి.శైలజ బుధవారం పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని పాఠశాలల విద్యార్థులకు వేమన పద్యాలపై వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు జయంతిని నిర్వహించాలని ఆదేశించారు.

మందగమనం

పచ్చని పల్లెసీమలకైనా, వెచ్చని పట్టణాల అభివృద్ధికైనా ప్రధానంగా కావల్సినవి నిధులే. వీటిని కొంత ప్రభుత్వం అందజేస్తే మిగిలినవి పన్నుల రూపేణా స్థానికుల నుంచి వసూలు చేస్తారు. ఇంటి పన్ను, లైబ్రరీ సెస్సు, కుళాయి పన్ను ఇలా పన్నులు రూపంలో వచ్చే నగదే ఆయా పట్టణాలు, గ్రామాల అభివృద్ధికి ఊతమై నిలుస్తాయి. కానీ బాపట్ల జిల్లావ్యాపంగా ఈ పన్నుల వసూళ్లు మందగమనంతో సాగుతున్నాయి. వీటి వసూళ్ల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

తగ్గిన పన్ను వసూళ్లు

- రూ. 50.33 కోట్లకు గానూ రూ.17.97 కోట్లు మాత్రమే వసూలు
- రూ. 32.36 కోట్ల వసూళ్లకు ప్రత్యేక కార్యచరణ
- 10 నాటికి పూర్తి చేయాలంటూ కలెక్టర్ ఆదేశం
- డివిజన్ల వారీగా లక్ష్యాల కేటాయింపు



పన్ను వసూళ్లపై గ్రామపంచాయతీ సిబ్బందితో చర్చిస్తున్న ఇన్‌చార్జ్ డీపీవో శంకర్ నాయక్

బాపట్లటౌన్: గ్రామీణ ప్రాంతాలను అన్నివిధాల అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం విశేష కృషిచేస్తున్న సంగతి తెలిసిందే. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పాఠశాలలను అభివృద్ధి చేయటం మొదలు.. సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి ప్రజల సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తోంది.

ప్రభుత్వం విడుదల చేసే గ్రాంట్లకు సంబంధించిన నిధుల పరిపుష్టితోనే గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రస్తుత పాలకవర్గాలు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులకు తోడుగా.. గ్రామ పంచాయతీల్లో పన్నులు, పన్నేతరములపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తే ఆయా గ్రామ పంచాయతీ ఖాతాల్లో నిధులు జమయ్యే అవకాశాలు ఉంటాయి. గ్రామ పంచాయతీల్లో వసూలు చేయాల్సిన పన్నులు, పన్నేతరములకు సంబంధించి ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలోని సిబ్బంది ఆ దిశగా పనిచేయటం లేదు. మరో 45 రోజుల్లో ఆర్థిక సంఘం ముగియనుండటంతో జిల్లా అధికార యంత్రాంగం పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించింది.

పన్ను వసూళ్లపై దృష్టిసారించాలి

గ్రామ పంచాయతీలకు ఆదాయాన్ని పెంచుకునే అంశంలో క్షేత్రస్థాయి అధికారులు సమిష్టిగా కృషి చేయాలి. పంచాయతీలోని సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు సమిష్టిగా పనిచేసి పంచాయతీ ఆదాయాన్ని పెంచుకునేందుకు కృషి చేయాలి. జిల్లాలోని అనేక గ్రామ పంచాయతీల్లో దశాబ్దం క్రితం ఉన్న ఇళ్ల సంఖ్యనే నేటికీ లెక్కల్లో చూపుతున్నారు. జిల్లాలోని 459 గ్రామ పంచాయతీల్లో సుమారు 50 శాతం గ్రామ పంచాయతీల రూపురేఖలే మారిపోయాయి. ఆయా పంచాయతీల్లో కొత్త కాలనీలు కూడా ఏర్పడ్డాయి.

వాటిని గుర్తించి పన్నులు విధించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ పంచాయతీ పరిధిలో పన్ను వసూలు చేయడం, వాటిని అభివృద్ధి పనులకు వెచ్చించుకునే విషయంలో గ్రామ సర్పంచ్‌లది కీలకపాత్ర. ఆయా గ్రామ పంచాయతీల్లో పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని పూర్తిగా గ్రామాభివృద్ధి కోసం వెచ్చించుకునే సౌలభ్యం ఉంది. అయినా వివిధ ఆదాయాన్ని కోల్పోతున్నట్లు తెలుస్తోంది. గ్రామాల సర్పంచులు పన్ను వసూళ్లపై పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు లేకపోలేదు.

గ్రామ పంచాయతీల్లో పన్నులు (ఇంటి పన్ను, లైబ్రరీ సెస్సు, కుళాయి పన్ను), పన్నేతరములు (మార్కెట్ వేలాలు, షాపింగ్ అద్దెలు, లైసెన్స్ ఫీజులు, కుళాయి ఫీజులు, భవన నిర్మాణ ఫీజులు) రూపంలో సొంత వనరులను సమీకరించుకోవడంలో అటు పంచాయతీ కార్యదర్శులు.. ఇటు సర్పంచ్‌లు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉంది.

జిల్లా సమాచారం	
మొత్తం పంచాయతీలు	459
మేజర్ పంచాయతీలు	156
మైనర్ పంచాయతీలు	303
కార్యదర్శుల సంఖ్య	447
వసూలు చేయాల్సిన మొత్తం	రూ. 50,33,83,902
ఇప్పటి వరకు వసూలు చేసింది	రూ. 17,97,62,327
వసూలు చేయాల్సింది	రూ. 32,36,21,575

45 రోజుల ప్రత్యేక కార్యచరణ

	మొత్తం	వసూలు చేసినవి	చేయాల్సినవి
ఇంటిపన్నులు	39,06,76,041	11,79,27,150	27,27,48,891
నాన్ ట్యాక్స్ పన్నులు	11,27,07,861	6,18,35,177	5,08,72,684
మొత్తం	50,33,83,902	17,97,62,327	32,36,21,575

10 లోపల వసూలు చేయాలి

జిల్లాలో పన్నులు ఇప్పటి వరకు 30 శాతం మాత్రమే వసూలు చేయటం జరిగింది. పన్నేతరములు 55 శాతం వసూలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు పన్నులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పన్నుల వసూళ్లలో జాప్యం జరుగుతోంది. కలెక్టర్ ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న రూ. 32.36 కోట్లను 45 రోజుల్లోగా వసూలు చేసే విధంగా ప్రత్యేక కార్యచరణ చేపట్టాం.

– శంకర్ నాయక్, ఇన్‌చార్జ్ డీపీవో

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ కె. విజయకృష్ణన్ సూచన



బాపట్లటౌన్: రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. విజయకృష్ణన్ తెలిపారు. 34వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల18 నుంచి 24వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు జరగనున్నాయన్నారు. రవాణాశాఖ అధికారులు ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ రోజు వారీ కార్యక్రమాలను అమలు చేయాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు జరగడానికి గల కారణాలు, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, వాహనచోదకులు పాటించాల్సిన నియమ నిబంధనలను క్షుణ్ణంగా వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి ఎం.చంద్రశేఖర్ రెడ్డి, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు పి.అంకమ్మ రావు, బి.వి.రంగారావు, ఎన్.ప్రసన్నకుమారి, ఏఓఉషా పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 573.20 అడుగుల వద్ద ఉంది. ఇది 264.6026 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 5,292, ఎడమకాలువకు 6,634, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 12,936, ఎస్‌ఎల్‌బీసీకి 2,400, వరదకాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 27,582 క్యూసెక్కులు విడుదలవుతోంది. సాగర్ జలాశయానికి 13,649 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

రంగస్థలంతో సామాజిక చైతన్యం

- అనంతవరంలో ముగిసిన ఎన్టీఆర్ కళాపరిషత్ నాటిక పోటీలు
- సినీ నటుడు నారా రోహిత్, నాటక, సినీ రచయిత బుర్రా సాయి మాధవ్ హాజరు



గుర్తుతెలియని శవం నాటికలో ఓ సన్నివేశం

యద్దనపూడి: సమాజంలోని వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు అవలోకనం చేసుకుంటూ ప్రజల కష్టాలను, కడగండ్లను ప్రేక్షకుల దృష్టికి తీసుకువచ్చే నాటకం మానవ జీవితానికి దర్పణం వంటిదని సినీ నటుడు నారా రోహిత్ పేర్కొన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలో ప్రదర్శిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ నాటిక పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాటక, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, సినీ నిర్మాత అట్లూరి నారాయణరావు, నాటక రచయిత, దర్శకులు జరుగుల రామారావు హాజరై ప్రసంగించారు. నాటకంలోని పాత్ర తీరుతెన్నులు, స్వభావాన్ని చూపుతూ.. తమ నటనా చాతుర్యంతో ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారన్నారు. బుర్రా సాయి మాధవ్ మాట్లాడుతూ నాటకాల ద్వారా సమాజానికి ఉపయోగపడే సందేశాత్మక అంశాలు ఎన్నో మిళితమై ఉంటాయన్నారు. ఎన్టీఆర్ కళాపరిషత్ అనంతవరం అధ్యక్షుడు గుదే పాండు రంగారావు, కందిమళ్ల సాంబశివరావు, నిర్వాహకులు వెంకట సుబ్బారావు, తారక రామారావు, వంశీ, సాంబశివరావు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

అలరించిన నాటికలు

గుడి ఎనక నాసామి నాటికను చైతన్య కళాస్రవంతి విశాఖపట్నం వారు ప్రదర్శించారు. మనిషి తనలోని దైవత్వాన్ని మరచి ఎదుటివారిలో దేవుడిని వెతికినంతకాలం దొంగబాబాలు, స్వామిజీలు పుడుతూనే ఉంటారనే సందేశాన్ని ఇచ్చింది. రసఝరి పొన్నూరు వారు ప్రదర్శించిన గుర్తుతెలియని శవం నాటికలో ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాల డొల్ల సంబంధాన్ని ఆవిష్కరించారు. అరవింద ఆర్ట్స్ తాడేపల్లివారు ప్రదర్శించిన వెండి అంచులు నాటికలో స్త్రీల పునరుత్పత్తి హక్కులపై కూడా పురుషుల ఆధిపత్యం పెరిగిపోయిందని వివరించారు.

న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ విజయవాడ వారు ప్రదర్శించిన పిపీలికం నాటికలో బలవంతుడు, బలహీనుల మధ్య సంబంధాన్ని, కార్మికుడి గతిని భవితని మార్చే సూత్రాన్ని ఒక చీమ లోకానికి తెలియజేసింది.

క్షేత్రస్థాయికి 'సంక్షేమ పాలన'

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, ఎంపీ మోపిదేవి



మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు. పక్కన మాజీ ఉపసభాపతి కోన రఘుపతి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనను క్షేత్రస్థాయిలో.. ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలోని మండలపార్టీ కన్వీనర్ల సమావేశం బాపట్ల గౌతమ్ పంక్షన్ హాలులో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎంపీ మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ.. స్వాతంత్రం అనంతరం 75 సంవత్సరాల పాలన లో ఎవరూ చేయనంతగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సరికొత్త పాలనను తీసుకు వచ్చారన్నారు. ప్రజల ఆలోచనలు, అవసరాలకు అనుగుణంగా పాలకులు నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

ప్రజల అవసరాలు గుర్తించిన సీఎం వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో అర్హులకు సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అందరికీ అందించేందుకు వలంటీర్, సచివాలయ వ్యవస్థలను తీసుకువచ్చారన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే కాక ఇవ్వని హామీలను జగనన్న ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. జాతీయస్థాయిలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటికే చేరుస్తున్నారన్నారు. విద్యాదీవెన, వసతి దీవెనతో పాటు పలు పథకాలు అందరికీ అందుతున్నాయన్నారు. ఒక్కో కుటుంబానికి రెండు లక్షల నుంచి 5 లక్షల రూపాయల వరకు లబ్ధి చేకూరుతోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటివల్ల ప్రజలకు జరుగుతున్న లబ్ధిని కన్వీనర్లు, గృహసారథులు గ్రామగ్రామాన ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి సందేశాన్ని ప్రతి లబ్ధిదారుడికి చేర్చాలన్నారు. రాబోయే కాలంలో కన్వీనర్లు, గృహసారధుల పాత్ర కీలక మన్నారు. నెలలో పది రోజులు ప్రతి ఇంటికీ వెళ్లాలన్నారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వం పేదల ఆర్థిక స్థితిగతులను మెరుగు పరిచిందనీ, అన్ని వర్గాల వారికి లబ్ధి చేకూరిందన్నారు. ఈ విషయాన్ని పార్టీ కన్వీనర్లు, గృహసారధులు ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల నియోజకవర్గం ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్, అద్దంకి ఇన్‌చార్జ్ బాచిన కృష్ణ చైతన్యతోపాటు పార్టీ వివిధ విభాగాలకు చెందిన నేతలు, కన్వీనర్లు పాల్గొన్నారు.

ఉద్యాన విజ్ఞానం

- పొలంబాట పట్టిన విద్యార్థులు
- మార్కాపురం ఉద్యాన విద్యార్థులకు బాపట్లలో శిక్షణ
- సేంద్రియ పద్ధతిలో పంటలసాగు
- మూడు నెలలపాటు సాగనున్న శిక్షణ తరగతులు
- స్వయం ఉపాధి దిశగా విద్యార్థుల అడుగులు
- పరిశ్రమలు నెలకొల్పేలా ప్రయత్నాలు
- ఉద్యానవన సాగుపై మెలకువలు నేర్చుకుంటున్న విద్యార్థులు



ఎరువులను తెచ్చుకుంటున్న విద్యార్థి



నారాకోడూరులోని కూరగాయల తోటలో కూరగాయలు కోస్తున్న విద్యార్థినులు

బాపట్లటౌన్: ఉన్నత విద్యాబుద్ధులు నేర్చుకొని కళాశాల నుంచి బయటకు వెళ్లారు. తరగతి గదిలో నేర్చుకున్న పాఠాలను సద్వినియోగం చేసుకుంటూ ఉద్యానవన పంటలసాగుపై అవగాహన పెంచుకుంటున్నారు. ఆకుకూరలు, కాయకూరలు, పండ్ల తోటల పెంపకంలో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి పంటల సాగుపై శిక్షణ పొందుతున్నారు. ఉద్యోగం కోసం వెంపర్లాడకుండా తమ కాళ్లపై నిలబడి తమతోపాటు మరికొంతమందికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ప్రకాశం జిల్లా, మార్కాపురం ఉద్యానవన కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు గ్రామీణ ఉద్యాన పని అనుభవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల జిల్లాకు చేరుకున్నారు.

ప్రకాశం విద్యార్థులకు శిక్షణ...

వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ కళాశాలలు, పరిశోధన స్థానాలకు పుట్టినిల్లు అయిన బాపట్లలో శిక్షణ పొందితే ఎలాంటి రకాల పంటలను అయినా ఇట్టే పండించచ్చు అనేది ఆయా కళాశాలల నమ్మకం. దీంతో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలైన ఉద్యానవన విద్యను అభ్యసించే విద్యార్థులకు చదువులు ముగిసేముందు నిర్వహించే ఫీల్డ్ ట్రైనింగ్ కార్యక్రమానికి చుట్టుపక్కల జిల్లాల్లోని కళాశాలల యాజమాన్యం బాపట్లనే ఎంపిక చేసుకుంటారు.

మూడు నెలలపాటు బాపట్లలోనే...

ప్రకాశం జిల్లా, మార్కాపురంలోని ఎస్ఎస్ కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్స్‌లో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు మరో మూడు నెలల్లో చదువు పూర్తి కానుంది. చివరి మూడు నెలలు ఫీల్డ్ ట్రైనింగ్‌లో భాగంగా బాపట్లకు చేరుకున్నారు. 35 మంది విద్యార్థులు బాపట్లలోనే ఉంటూ శిక్షణా తరగతులకు హాజరవుతున్నారు. వీరికి ఫీల్డ్ అవగాహన కల్పించేందుకు బాపట్ల జిల్లాలోని చీరాల మండలం, కావూరివారిపాలెం, బాపట్ల మండలంలోని వెదుళ్లపల్లి, గుంటూరు జిల్లాలోని నారాకోడూరు, వేజెండ్ల, గుండవరం గ్రామాలతోపాటు, బాపట్ల జీడిమామిడి పరిశోధన స్థానాలను ఎంపిక చేశారు.

సేంద్రియ సాగు దిశగా అడుగులు...

విచక్షణా రహితంగా పురుగుమందులు వాడిన ఆహార పదార్థాలను తినడం వలన సంభవిస్తున్న అనారోగ్య సమస్యలను నేరుగా గమనిస్తున్న విద్యార్థులు భవిష్యత్‌లో ఎలాంటి రసాయనిక ఎరువుల వినియోగం లేని ఆహార ఉత్పత్తులను మాత్రమే ప్రజలకు అందించేందుకు నడుంబిగించారు. శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థులు వారంతటా వారే జీవామృతాన్ని తయారుచేసుకొని వారికి కేటాయించిన పొలాల్లో పిచికారీ చేస్తూ మొక్కలను పెంచుతున్నారు.

పూలతోటల గురించి చాలా విషయాలు నేర్చుకున్నాం



పుస్తకాల్లో చదువుకున్న పాఠాలను శిక్షణలో భాగంగా వెదుళ్లపల్లిలోని కొంతపొలాన్ని తీసుకొని మేము స్వయంగా పూలతోటలను సాగుచేశాం. ఎలాంటి పురుగుమందులు వాడకుండా పూలతోటలకు వచ్చే తెగుళ్లను కూడా నివారించుకుంటూ పూల దిగుబడిని పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. పూలు పూయించడంతోపాటు దిగుబడి వచ్చిన పూలను మార్కెట్‌లో ఎలా విక్రయించాలనే దానిపై కూడా అవగాహన కలిగింది.

– ఎం.బిందు, ఎం.అనూష, జ్యోత్స్న

రసాయనాలు లేని కూరగాయలు పండిస్తాం



మేము చదువుకున్న పాఠాలు, ఫీల్డ్‌లో నేర్చుకున్న అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్‌లో మేమే ఆకు కూరలు, కాయకూరలు, పండ్లతోటలు సాగుచేపడుతాం. ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండా కేవలం సేంద్రియ పద్ధతిలో మాత్రమే సాగుచేసేందుకు అనుభవం వచ్చింది. జీవామృతం తయారుచేసుకొని దాని ద్వారా మాత్రమే పంటలసాగు చేపడుతాం.

– వి. కావ్య, యు.తన్మయ్

పూరిల్లు దగ్ధమైంది.. పేదగుండె ఆగింది!

- ప్రమాదాన్ని చూస్తూ గుండెపోటుకు గురై వృద్ధురాలి మృతి
- పూడివాడ పడమట పాలెంలో ఘటన





అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పూరిల్లు
గుండెపోటుతో మృతి చెందిన సామ్రాజ్యం (ఫైల్)

నగరం: అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమవుతుండంతో ఆందోళనకు గురై కుప్పకూలి గుండెపోటుతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని పూడివాడ పడమట పాలెంలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు పూడివాడ శివారు పడమటపాలెం గ్రామానికి చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. దీంతో ఇంట్లో నిద్రిస్తున్న రమేష్ కుటుంబ సభ్యులు భయంతో బయటకు పరిగెత్తారు. పూరిల్లు అగ్నికి ఆహుతవ్వడం చూసి ఆందోళన చెందిన రమేష్ తల్లి సామ్రాజ్యం (65) ఒక్కసారిగా కిందపడి గుండెపోటుతో మృతి చెందింది. సామ్రాజ్యం మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అగ్ని ప్రమాదంలో సుమారు రెండు లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. అగ్ని ప్రమాద విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ పాగోలు సుజాత సంఘటన స్థలానికి చేరుకుని రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ సాయం కింద 20 కేజీలు బియ్యం, రూ.5 వేలు నగదు, నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాగోలు వెంకటేశ్వరావు, జాలాది సునీల్, శివయ్య పాల్గొన్నారు.

భవనం తరలింపు పనులు షురూ



భవనాన్ని షిఫ్టింగ్‌తో వెనక్కు జరుపుతున్న కార్మికులు

బల్లికురవ: స్థానిక బల్లికురవలో ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్‌లో నిర్మించిన భవనాన్ని షిఫ్టింగ్ పనుల్లో భాగంగా సుమారు 5 అడుగుల మేర వెనక్కు జరిపారు. బల్లికురవ నుంచి సంతమాగులూరు వెళ్లే రోడ్డుకు తూర్పు భాగంలో షేక్ ఖాదర్ వెంకటేశ్వర ఆటోమొబైల్ షాపు నిర్వహిస్తున్నారు. ఆక్రమణలు తొలగించే పనిలో భాగంగా అధికారులు భవనంలోని సగ భాగానికి మార్కింగ్ ఇచ్చి తొలగిస్తామంటూ నోటీసులు ఇచ్చారు. ఆటోమొబైల్ యజమాని విజయవాడలోని జేజే లిఫ్టింగ్ అండ్ షిప్పింగ్ సర్వీసెస్‌ను కలిశారు. దీంతో ఆ కంపెనీ యండీ కె. శాయి శ్రీనివాస్ భవనాన్ని పరిశీలించి ఏపీసీఆర్‌డీఏ అనుమతులతో 20 రోజుల క్రితం 28 అడుగుల మేర వెనక్కు జరిపేందుకు పనులకు శ్రీకారం చేట్టారు. పనులు పూర్తి కావటంతో భవనానికి తూర్పు భాగంలో ఫౌండేషన్ వేసి 5 అడుగులు వెనక్కు జరిపారు. వారం రోజుల్లో భవనాన్ని పూర్తి స్థాయిలో వెనక్కు జరిపి కంప్లిషన్ సర్టిఫికెట్ అందజేస్తామని యండీ వివరించారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- ప్రాపర్టీ సర్టిఫికెట్ జారీచేసిన విషయంలో తలెత్తిన వివాదం
- సీఎం కాల్ సెంటర్‌కు ఫిర్యాదుచేసిన హక్కుదారుడు
- సీరియస్‌గా స్పందించిన జిల్లా కలెక్టర్



చెరుకుపల్లిలో వివరాలు సేకరిస్తున్న ఇన్‌చార్జ్ డీపీవో శంకర్‌నాయక్

బాపట్లటౌన్: రెవెన్యూ వ్యవహారంలో తలదూర్చి... అంతా తానై వ్యవహరించిన ఓ పంచాయతీ కార్యదర్శిపై సస్పెండ్ వేటు పడింది. చెరుకుపల్లి గ్రామ పంచాయతీలో 2019–2021 మధ్య కాలంలో గ్రేడ్–3 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన లచ్చి నందకిషోర్ అదే గ్రామానికి చెందిన లచ్చి ఉమామహేశ్వర రావు పేరుతో ప్రాపర్టీ సర్టిఫికెట్ మంజూరు చేశారు. సదరు వ్యక్తి ఈ సర్టిఫికెట్ ఆధారంగా భూమిని వేరేవ్యక్తుల పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయంపై భూమిపై హక్కు కలిగిన లచ్చి గాంధీ పంచాయతీ కార్యదర్శి రెవెన్యూ అధికారులు మంజూరు చేసే ప్రాపర్టీ సర్టిఫికెట్‌ను తనకు అనుకూలమైన వ్యక్తుల పేరుతో మంజూరు చేశారని సీఎం కాల్‌సెంటర్‌కు ఇటీవల లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదుపై సీరియస్‌గా తీసుకున్న జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై పూర్తి నివేదిక అందజేయాలని రేపల్లె ఆర్డీవో, చెరుకుపల్లి తహసీల్దార్‌ను ఆదేశించారు. రేపల్లె ఆర్డీవో ఇచ్చిన నివేదికపై తుది విచారణ చేపట్టాల్సిందిగా ఇన్‌చార్జి డీపీవోను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ డీపీవో శంకర్ నాయక్ చెరుకుపల్లి పంచాయతీ కార్యాలయంలో బుధవారం విచారణ చేసి తుది నివేదిక కలెక్టర్‌కు అందజేశారు. రెవెన్యూ వ్యవహారంలో తలదూర్చి తప్పుడు సర్టిఫికెట్‌ను మంజూరు చేసిన పంచాయతీ కార్యదర్శి లచ్చి నంద కిషోర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం లచ్చి నందకిషోర్ పొన్నూరు మండలం, మునుకుదురు గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇదిలా ఉండగా నందకిషోర్ చెరుకుపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసే సమయంలో పంచాయతీకి చెందిన నిధులు రూ. 20 లక్షలను ఆయన భార్య పేరుతో ఉన్న అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారని, అదేగ్రామానికి చెందిన మరో వ్యక్తి ఇటీవల స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఇన్‌చార్జి డీపీవో శంకర్‌నాయక్‌ను విచారణాధికారిగా నియమించారు. ప్రస్తుతం ఈ విషయంపై కూడా విచారణ జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

హోరాహోరీగా ఎడ్ల బల ప్రదర్శన



బండ లాగుతున్న ఎడ్ల జత దృశ్యం



పోటీలు ప్రారంభిస్తున్న గొట్టిపాటి భరత్

పర్చూరు: మండల పరిధిలోని అన్నంభొట్లవారిపాలెం గ్రామంలో గొట్టిపాటి హనుమంత రావు మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 35వ జాతీయ స్థాయి బండలాగు ఎడ్ల బలప్రదర్శన పోటీలు పోటాపోటీగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి జరిగిన సేద్య విభాగం విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా, కురిచేడు మండలం, కాటంవారిపల్లెకు చెందిన కాటం పెద్దిరెడ్డి ఎడ్లజత 5622.4 అడుగుల దూరం లాగి మొదటి బహుమతిని గెల్చుకున్నాయి. రాజుపాలెం మండలం, ఇనిమెట్లకు చెందిన కటకం వెంకటేశ్వర్లు ఎడ్లజత 5568.4 అడుగుల దూరం లాగి ద్వితీయ, గుంటూరు జిల్లా, కాకుమానుకు చెందిన నల్లమోతు వీరయ్యచౌదరి ఎడ్ల జత 4500 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతిని గెల్చుకుంది. అలాగే ఏడు వరకు విజేతల వివరాలు వెల్లడించారు.

బుధవారం రాత్రి సబ్ జూనియర్స్ విభాగంలో మొత్తం 8 జతలు పాల్గొన్నాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా గురజాల నియోజకవర్గ పరిశీలకులు గొట్టిపాటి భరత్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం రైతులకు మెమోంటోలు అందజేశారు. గురువారం సాయంత్రం పెద్దసైజు విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గోరంట్ల భాస్కరరావు తెలిపారు.

ఎడ్ల బలప్రదర్శన పోటీలు

అన్నంభొట్లవారిపాలెం గ్రామంలో గోరంట్ల రత్తయ్య చౌదరి ప్రాంగణంలో మంగళవారం రాత్రి జరిగిన సబ్ జూనియర్స్ విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామానికి చెందిన పులగం త్రిషజ్ఞారెడ్డి ఎడ్లజత 4723.07 అడుగుల దూరం లాగి మొదటి బహుమతిని గెల్చుకున్నాయి. బాపట్ల జిల్లా, కారంచేడు మండలం, స్వర్ణ గ్రామానికి చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ఎడ్లజత 4500 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతిని, కృష్ణాజిల్లా, పెనమలూరుకు చెందిన భావినేని మల్లిఖార్జునరావు అండ్ బ్రదర్స్ ఎడ్లజత 4274.03 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతిని గెల్చుకున్నాయి. బుధవారం రాత్రి సీనియర్స్ విభాగంలో పోటీలు జరుగుతున్నాయి. గురువారం సాయంత్రం జూనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కొనకంచి సుబ్బారావు తెలిపారు.

ముస్లింల మేలు కోరే సీఎం జగన్

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు(గుంటూరు): ముస్లిం మైనార్టీల మేలు లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీ ముస్లిం సమాజ్ ములాఖతీ నిర్వహించనున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా బుధవారం బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో ముస్లిం మతపెద్దల సమావేశం జరిగింది. రాజకీయాలకు అతీతంగా జరిగే ములాఖతీ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ముస్లిం మత పెద్దలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ తమ పార్టీకి, తమకు అండగా నిలిచిన అన్ని వర్గాల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా కొత్త సంవత్సరంలో తొలిసారిగా జరుపుతున్న ముస్లిం సమాజ్ ములాఖతీకి అత్యంత ప్రాధాన్యత నెలకొన్నదన్నారు. సమస్యల పట్ల, సమాజం పట్ల అవగాహన గల ముస్లిం సోదరులందరినీ ములాఖతీలో భాగస్వామ్యం చేయాలని సూచించారు.

రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలో ముస్లింలకు తగిన గుర్తింపు, గౌరవం ఇచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలోపేతం చేయాలన్న కృతనిశ్చయంతో సీఎం జగన్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. ప్రణాళికాబద్ధంగా మైనారిటీ అక్షరాస్యత శాతం పెంపునకు కృషి చేస్తున్నారని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందుబాటులోకి తెచ్చారన్నారు. ముస్లింల మేలు కోరే సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో డాక్టర్ వై. షేక్, ముస్లిం మత పెద్దలు హాఫీజ్ అబ్బాస్, హాఫీజ్ఇర్షాద్, హాఫీజ్ సల్మాన్, హాఫీజ్ అయూబ్, మౌలానా అబ్దుల్ రెహ్మాన్, ప్రభుత్వ క్వాజీ హాఫీజ్ ఉస్మాన్‌సిద్దిఖీ, కార్పొరేటర్లు మార్కెట్ బాబు, షేక్ రోషన్, మౌలానా అబుల్ కలాం అజాద్, షాదీఖానా చైర్మన్ షేక్ ఫరియాజ్ పాల్గొన్నారు.

22న కానిస్టేబుళ్ల పోస్టులకు ప్రిలిమినరీ రాత పరీక్ష

- 45 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు
- స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన గుంటూరు రేంజ్ ఐజీ



స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న ఐజీ త్రివిక్రమవర్మ, చిత్రంలో ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో ఈ నెల 22న జిల్లాలో నిర్వర్తించే కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు గుంటూరు రేంజ్ ఐజీ డాక్టర్ సీఎం త్రివిక్రమవర్మ అన్నారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాలులో బుధవారం పలు విభాగాల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 45 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఏపీ పోలీస్ కానిస్టేబుల్ నియామక ప్రిలిమినరీ రాత పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను లోనికి అనుమతిస్తారని, 10 గంటలకు ఒక నిమిషం దాటినా ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి అనుమతించరని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. అభ్యర్థులను గుర్తింపు కార్డు ద్వారా లోనికి అనుమతిస్తారని, హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు, నలుపు లేదా బ్లూ పెన్ మాత్రమే ఉండాలని చెప్పారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్‌లను అనుమతించేదిలేదని స్పష్టం చేశారు. పరిసర ప్రాంతాల్లో జెరాక్స్, మొబైల్ దుకాణాలు మూసివేయాలని, గుంపులుగా జనం ఉండరాదన్నారు. అనంతరం ప్రశ్నాపత్రాలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను ఐజీ పరిశీలించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ ప్రొఫెసర్, పరీక్షల చీఫ్ సమన్వయకర్త సిద్దయ్య, చీఫ్ ఇన్విజిలేటర్లు, సూపరింటెండెంట్‌లు, ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), ఎ.శ్రీనివాసరావు (క్రైం), అనీల్‌కుమార్ (ఎల్‌అండ్‌ఓ), కె.కోటేశ్వరరావు (ఏఆర్), ఎస్‌బీ సీఐలు బి.నరసింహారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సామర్లకోట వరకు గుంటూరు-విశాఖపట్నం రైలు

లక్ష్మీపురం: గుంటూరు– విశాఖపట్నం – గుంటూరు రైలు విజయవాడ డివిజన్‌లోని సామర్లకోట వరకు మాత్రమే నడుపుతున్నట్లు గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం ఆంజనేయులు బుధవారం తెలిపారు. పలు అభివృద్ధి పనులు నేపథ్యంలో రైలు నెంబర్ 17239 ఈనెల 21, 22వ తేదీలలో గుంటూరు– సామర్లకోట వరకు మాత్రమే వెళ్తుందని చెప్పారు.

ఫిబ్రవరి 1,2 తేదీల్లో జాతీయ సదస్సు



సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ ఆచార్య పి.రాజశేఖర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ డాక్టర్ పి.రవి మాట్లాడుతూ అడ్వాన్సెస్ ఇన్ ఫైటో మెడిసిన్ అండ్ ఫైట్ నానో కాంపోజిట్స్ అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అల్లోపతి మెడిసిన్లో వచ్చేటువంటి డ్రగ్ రెసిస్టెన్స్‌ను దృష్టిలో పెట్టుకొని నాచురల్ ప్రొడక్ట్స్ ప్రాముఖ్యతని, ఉపయోగాలను తెలియపరచడమే సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు. పలు కొత్త పద్ధతులను ఉపయోగించి నేచురల్ ప్రొడక్ట్స్ నుంచి కొత్త మందులను తయారు చేయడమే ప్రస్తుత పరిస్థితుల్లో అవసరమని చెప్పారు. జాతీయ సదస్సుకి కో కన్వీనర్ గా కే విజయ్ కిషోర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ కేతు ప్రవల్లిక, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా డాక్టర్ ఎం.గాయత్రి రమ్య, డాక్టర్ డి.రవిచంద్రశేఖర్ రెడ్డి వ్యవహరిస్తారని చెప్పారు. బ్రోచర్ ఆవిష్కరణలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రమీల రాణి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ప్రొఫెసర్ సరస్వతి రాజు అయ్యర్, యూజీ పరీక్షల సమన్వయకర్త ప్రొఫెసర్ సంధ్య కోల్, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ప్రొఫెసర్ సునీత, దూర విద్య కేంద్రం పరీక్షల నిర్వహణ సమన్వయకర్త ప్రొఫెసర్ సోమశేఖర్, ర్యాంకుల కోఆర్డినేటర్ డాక్టర్ భవనం నాగకిషోర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఖోఖో ఆటగాడిగా సీఈసీ విద్యార్థి



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

చీరాల: దక్షిణ భారత సాంకేతిక విశ్వవిద్యాలయాల ఖోఖో టోర్నీలో ఉత్తమ ఆటగాడిగా చీరాల ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. ఈ నెల 9 నుంచి 12 వరకు జేఎన్టీయూ కాకినాడలో దక్షిణ భారత సాంకేతిక విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరీ నుంచి 78 జట్లు పాల్గొన్నాయి. జేఎన్టీయూ కాకినాడ తరఫున చీరాల ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన ఎ.శివారెడ్డి, వి.ఏడుకొండలరెడ్డి ప్రాతినిధ్యం వహించారు. తుది పోరులో జెఎన్టీయూకే జట్టు, ఏఎన్‌యూ జట్లు తలపడ్డాయి. శివారెడ్డి, ఏడుకొండలరెడ్డి ప్రతిభ కనబరిచి జట్టును విజేతగా నిలపడంలో కీలకపాత్ర పోషించారు. ఉత్తమ ఆటగాడిగా శివారెడ్డి ఎంపికయ్యాడు. మొదటి స్థానంలో జెఎన్టీయూకే రాగా, ద్వితీయ స్థానంలో ఏఎన్‌యూ జట్టు, తృతీయ స్థానంలో మంగళూరు జట్టు నిలిచాయి. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ఇద్దరు ఆటగాళ్ళను ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల అందించిన తోడ్పాటుతోనే తాము ఈ స్థాయికి నిలిచామని క్రీడాకారులు తెలిపారు. ప్రిన్సిపాల్ పి.రవికుమార్ అభినందించారు.

విద్యాసంఘం బాధ్యతలు విద్యాపీఠానికి..

ఇంగ్లిష్ మీడియం ప్రాథమిక పాఠశాలకు శ్రీకారం



బాధ్యతలను స్వీకరిస్తున్న శ్రీ సరస్వతి విద్యాపీఠం నిర్వాహకులు

రేపల్లె: చాట్రగడ్డకు చెందిన సనాతన వేదాంత నష్టాశమ విద్యాసంఘం బాధ్యతలను బుధవారం విజయవాడకు చెందిన శ్రీ సరస్వతి విద్యాపీఠం చేపట్టింది. ఈ సందర్భంగా బాధ్యతలను నిర్వాహకులు విద్యాపీఠంకు చెందిన ఆర్గనైజింగ్ సెక్రటరీలు లింగం సుధాకర్‌రెడ్డి, కన్నా భాస్కర్, సెక్రటరీ కొసనం జగదీష్‌లు స్వీకరించారు. సనాతన వేదాంత నష్టాశమ విద్యామందిర్ ఇంగ్లిష్ మీడియం ప్రాథమిక పాఠశాలను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పాఠశాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కొత్తపల్లి రమేష్‌చంద్ర, ఉపాధ్యక్షులుగా డాక్టర్ సురేంద్ర బాబు, నారాయణ, కార్యదర్శిగా కన్నెగంటి రామరాయచౌదరి, సహకార్యదర్శిగా అశోక్‌కుమార్, కోశాధికారిగా వెంకటప్పయ్య, సభ్యులుగా డాక్టర్ రాజగోపాల్, నార్ల సైనా, సలహాసభ్యులుగా కృష్ణ కుమార్, బసవపున్నయ్య, హరిబాబులు ఎన్నికయ్యారు.

ముగిసిన ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు



కళాకారులకు బహుమతులు అందజేస్తున్న ఇంకొల్లు సీఐ సూర్యనారాయణ

ఇంకొల్లు (చినగంజాం): గత 10 రోజులుగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారతీయ కళార్చన కార్యక్రమంలో భాగంగా గత 10 రోజులుగా కోలాట ప్రదర్శనలు, ఏకపాత్రాభినయాలు, నాటికలు, నాటకాలు, సంగీత కచ్చేరిల ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఈదుమూడి కోలాటం సమాజం, కొప్పెరపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల వారిచే కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. ఆదర్శ హైస్కూల్ విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిలకలూరిపేటకు చెందిన ది అమెచ్యూర్ డ్రమాటిక్ అసోసియేషన్ హర్షరుతువు నాటికను ప్రదర్శించారు. అనంతరం ముగింపు కార్యక్రమానికి ఇంకొల్లు సీఐ వి. సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

22న బాలబాలికల టేబుల్ టెన్నిస్ పోటీలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22న స్థానిక బీఆర్ స్టేడియంలో ఉదయం 8 గంటలకు అండర్–13, 17 బాలబాలికల జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నట్లు చీఫ్ కోచ్ మహేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభకనబరచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు కోచ్ నరసింహారావు సెల్ నంబర్ 98482 98333ను సంప్రదించాలన్నారు.